క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



కొంకుదురులో రాట ముహూర్తం చేస్తున్న కమిటీ సభ్యులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని గోపాల రామానాయడు వీధిలో ఉన్న అమ్మవారి ఆలయం వద్ద శ్రీదేవి బాలభక్త సమాజంలో ఆధ్వర్యంలో జరిగే దసరా ఉత్సవాలకు గురువారం రాట ముహూర్తం చేశారు. ఉత్సవాలకు గ్రామానికి చెందిన తమలంపూడి సుధాకర రెడ్డి, వరలక్ష్మి దంపతులు కర్తలుగా వ్యవహరించనున్నారు. దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

అన్న సమారాధన

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని వినాయక్ నగర్ కాలనీలో గురువారం మహాన్నసమారాధన చేశారు. గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిపారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పందలపాకతో పాటు కొంకుదురు, సావరం, తోస్సిపూడి, కొమరిపాలెం నుంచి భక్తులు తరలివచ్చి, అన్న ప్రసాదం స్వీకరించారు.

చిత్రలేఖనం పోటీలు



తాము గీసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు గురువారం స్వచ్ఛ భారత్ మిషన్‌పై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని సూరంపూడి వైష్ణవి, ద్వితీయ బహుమతిని పూజిత గెలుచుకున్నారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ మాచారమ్మ, జీవీ మోహనరావు పాల్గొన్నారు.

తాపీ ధర్మారావు జయంత్యుత్సవం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ

సీతానగరం: ఆధునిక తెలుగు మహాకవి, హేతువాదశీలి తాపీ ధర్మారావు సాహిత్యం సమాజాన్ని ఆలోచింపజేస్తుందని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ అన్నారు. ఆ కళాశాలలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం తాపీ ధర్మారావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తాపీ ధర్మారావు రచనలను వక్తలు ప్రస్తావించారు. అధ్యాపకులు షేక్ దర్గా మదీనా, డాక్టర్ ఎం.సుధామయి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

రాజానగరం: మండలంలోని వెలుగుబంద ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు తమ వంతుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. తల్లిదండ్రులు, గ్రామస్తుల నుంచి సేకరించిన ఈ మొత్తాన్ని హెచ్ఎం అగ్నేశ్వరరావు ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేశారు.

జిల్లా అథ్లెటిక్స్‌లో బాల సరస్వతి ప్రతిభ



బాల సరస్వతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హేమ, అధ్యాపకులు

రంగంపేట: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థి బాల సరస్వతి ప్రథమ స్థానం సాధించినట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ అండర్ 18 విభాగంలో షాట్‌పుట్‌లో తమ కళాశాల విద్యార్థి పెమ్మనబోయిడి బాలసరస్వతి ప్రథమ స్థానం, డిస్కస్ త్రోలో జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించిందన్నారు.

సతీష్ కుమార్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు

సీటీఆర్ఐ: జీఎస్‌జే మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు చల్లగాని సతీష్ కుమార్ సేవలు అభినందనీయమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రామ్‌నగర్‌లోని బండారు దత్తాత్రేయ నివాసంలో గురువారం ఎక్స్‌లెన్స్ 2024 జాతీయ పురస్కారాన్ని చల్లగాని సతీష్ కుమార్‌కు అందజేశారు. సామాజిక అంశం కేటగిరిలో తనకు ఈ అవార్డు లభించిందని సతీష్ కుమార్ తెలిపారు.

వైద్యుల సమ్మె సైరన్

- జీవో 85కి వ్యతిరేకంగా ఆందోళనలు
- సమ్మెలోకి వెళ్లిన వైద్యులు
- ఇబ్బంది పడుతున్న రోగులు
- పీహెచ్‌సీల్లో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల సేవలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బిక్కవోలు: జీవో 85కు వ్యతిరేకంగా వైద్యులు సమ్మె సైరన్ మోగించారు. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళనను తీవ్రతరం చేశారు. జీవో 85 వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందంటూ ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. తమ మూడేళ్ల సర్వీస్‌కు అర్థం లేకుండా జీవో 85ను ప్రభుత్వం ఇవ్వడం అన్యాయమంటున్నారు. కాగా.. సమ్మె కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సేవలు వైద్యులు సేవలందించడం మానేశారు. నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు వైద్య సేవలు అందిస్తున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు.. డాక్టర్లు లేరని తెలుసుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిపోతున్నారు. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. డాక్టర్లు సమ్మెలో ఉండడంతో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు.

వైద్యుల నిరసనలు

జీవో 85ను వ్యతిరేకిస్తూ ఈ నెల 10వ తేదీన నుంచి పీహెచ్‌సీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిరసనలు మొదలయ్యాయి. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వారందరూ గళం విప్పారు. అనంతరం ఈ నెల 14వ తేదీ నుంచీ ఓపీ సేవలను నిలిపి వేశారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. వారి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టలేదు. దీంతో వైద్యులందరూ ఈ నెల 17 నుంచి బంద్‌లోకి వెళ్లిపోయారు. విజయవాడలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అర్జీలు అందించినా..

జీవో 85 వల్ల కలిగే నష్టాలపై వైద్యులు ముందుగానే ఎమ్మెల్యేలు, మంత్రులు , ఉన్నతాదికారులకు విన్నవించారు. వైద్యులు, వైద్య సంఘాల అర్జీలు సమర్పించాయి. కానీ వాటిని వారెవ్వరూ పట్టించుకోలేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో సమ్మె ప్రారంభించక తప్పలేదని వైద్యులు చెబుతున్నారు. జీవో 85 ద్వారా తమకు పోస్టు గ్రాడ్యుయేట్ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించి పీహెచ్‌సీ వైద్యులకు పీజీ ఇన్ సర్వీస్ కోటాను గతంలో మాదిరిగానే కొనసాగించాలన్నారు.

డాక్టర్లు లేరు

వైద్యం కోసం ఎప్పుడూ ప్రభుత్వ ఆస్పత్రికే వెళుతుంటాను. అక్కడ వైద్యులు అన్ని పరీక్షలు చేసి, మందులు అందజేస్తారు. వాటితోనే అనారోగ్యం కుదుటపడుతుంది. ఇప్పుడు ఆస్పత్రికి వెళ్లినా డాక్టర్లు అందుబాటులో లేరు. వారం దరూ సమ్మెలో ఉన్నారని చెబుతున్నారు. దీంతో వైద్యం కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– జి.లక్ష్మి, కొంకుదురు

జీవో 85 రద్దు చేయాలి



జీవో 85ను వెంటనే రద్దు చేయాలి. దీనిపై మా వ్యతిరేకతను తెలియజేస్తూ నిరసనలు చేశాం. అధికారులకు అర్జీలు అందించాం. వైద్య సంఘం పిలుపు మేరకు సమ్మె చేస్తున్నాం. ఈ జీవో వల్ల మూడేళ్ల సర్వీసులకు అర్థం లేకపోయింది. రెండు నెలలుగా జీవో రద్దు చేయమని కోరుతున్నాం. మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించాలి.

– డాక్టర్ జి.విజయలక్ష్మి, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: కానవరం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌పై మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. కానవరం, చక్రద్వారబంధం, ఫరిజల్లిపేట, రాధేయపాలెం సరఫరాకు ఆ సమయంలో అంతరాయం కలుగుతుందన్నారు.

25న చెకుముకి పోటీలు

సీతానగరం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25న చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నామని చెకుముకి మండల కన్వీనర్ కన్నూరి సతీష్‌బాబు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ 25న పాఠశాల స్థాయి, వచ్చేనెల ఒకటిన మండల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొవచ్చని, వారిలో సైన్స్‌పై అవగాహన, నూతన దృక్పథం పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. మరిన్ని వివరాలకు 90591 11210 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో గురువారం నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. దాత పెన్మెత్స శ్రీనివాస్ రాజు ఆధ్వర్యంలో 150 మందికి అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మధురపూడి: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ కోరుకొండ పీఓ జె.ఝాన్సీరాణి అన్నారు. కోరుకొండ ఫిల్మ్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవం, బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీఓ ఝాన్సీరాణి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు తీసుకుంటున్న పౌష్టికాహారం ద్వారానే వారి చిన్నారులు ఆరోగ్యవంతులవుతారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుకుంటున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు, బాలికా విద్య, బాల్య వివాహాల నిషేధం, పోక్సో చట్టం గురించి వివరించారు. ఈ సందర్భంగా పోషకాహార పదార్థాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు మోహనలక్ష్మి, ఏఎన్ఎమ్‌లు సుధ, సూర్యకుమారి పాల్గొన్నారు.

వివేకానందుడు యువతకు ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న స్వామి పరిజ్ఞానంద

రాజానగరం: దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన వివేకానందుని ఆదర్శంగా తీసుకుని, జన్మభూమి కీర్తిప్రతిష్టలను పెంపొందించే దిశగా యువత పయనించాలని రామకృష్ణ మిషన్ రాజమండ్రి కేంద్రం కార్యదర్శి స్వామి పరిజ్ఞానంద అన్నారు. చికాగోలో జరిగిన విశ్వమత మహాసభలలో స్వామి వివేకానందుడు ప్రసంగించి 131 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 27న రాజమహేంద్రవరంలో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై కళాశాల యువతను చైతన్యపరుస్తూ గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామి పరిజ్ఞానంద మాట్లాడుతూ వివేకానందుడు గొప్ప మేధావి, దేశాభివృద్ధి కోసం తన జీవితాన్నే త్యాగం చేసి గొప్ప దేశభక్తుడని కొనియాడారు.

గురుచరిత్ర పారాయణ



గురుచరిత్ర పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: లోక కల్యాణం, ప్రపంచ శాంతికి కోరుతూ స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో స్థానిక సాయిభక్త మండలి ఆధ్వర్యంలో చేపట్టిన 11 గురువారాల గురుచరిత్ర పారాయణ తొమ్మిదో వారానికి చేరుకుంది. వేకువజామున 5.15 గంటలకు కాకడ హారతి ఇచ్చిన అనంతరం ఈ పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్విరామంగా కొనసాగించారు. ఎనిమిదిన్నర గంటల పాటు ఏకధాటిగా జరిగిన ఈ పారాయణలో పలువురు భక్తులు పాల్గొని, వారి సమయానుసారం కొన్ని అధ్యాయాలు పఠనం చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరిశుభ్రతలో మేము భాగస్వాములం

సీతానగరం: పరిశుభ్రత కార్యక్రమంలో మేమందరం భాగస్వాములు అవుతామని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో తాము భాగస్వాములమవుతాయని, ఒకొక్కరం వంద మందికి ప్రేరణ కలిగించి, వారందరినీ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో బాగస్వాములయ్యేటట్లు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్ వైజర్ కె.సుధాకర్, హెచ్ఎలు నందీశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్న గైట్ విద్యార్థులు

ప్రతి ఒక్కరినీ చైతన్య పర్చాలి

రాజానగరం: ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలను కూడా అదేలా చూసుకోవాలని గైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకుంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను శ్రమదానం చేసి తొలగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, పీడీ డాక్టర్ సీఎం హెన్రీ, ఎన్ఎస్ఎస్ పీఓ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరి సహకారం అవసరం

బిక్కవోలు: దేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించాలని, అందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఎంపీడీవో జేఏ ఝాన్సీ అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. బిక్కవోలు లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు మూడు రోజులు నిర్వహిస్తుమని ఆలయం ఈవో భాస్కర్ తెలిపారు.



రంగంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

రంగంపేట పీహెచ్‌సీలో..

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేందం వద్ద స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. తాము శుభ్రంగా ఉండటంతో పాటు పరిసరాలు పరిశుభ్రత కోసం కొంత సమయం కేటాయిస్తామని, ఏటా 100 గంటలు, ప్రతి వారంలో రెండు గంటలు శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కె.జయమణి, ఎంపీహెచ్ఎస్ పి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

అన్నసమారాధన



రాజానగరంలో లడ్డూను పాడుకున్న భక్తుడు

రాజానగరం: వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో గురువారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజానగరంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలలో వినాయకుడి వద్ద ఉంచిన తొమ్మిది కిలోల లడ్డూకు వేలం వేయగా వేలుమూరి శివ రూ.15 వేలకు సొంతం చేసుకున్నాడు.

వైభవంగా వినాయక విగ్రహాల ఊరేగింపు



సీతానగరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వీధిలోని గణపతి విగ్రహం ఊరేగింపు

సీతానగరం: వినాయక చవితి ఉత్సవాలకు ముగిసిన నేపథ్యంలో నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం సీతానగరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం దగ్గరలో నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని ఊరేగించారు. తీన్‌మార్ డప్పులు, నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి వంగలపూడి రేవు వద్ద గోదావరిలో నిమజ్జన చేశారు. సీతానగరం బస్టాండ్ సెంటర్, లంకూరులో నెలకొల్పిన గణపతి విగ్రహాల నిమజ్జనం అనంతరం గురువారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సీతానగరం, చినకొండేపూడి, సింగవరం గ్రామాల విగ్రహాలను వంగపూడిలో, కూనవరం, ముగ్గళ్ల, రఘుదేవపురం, ఇనుగంటివారిపేట గ్రామాల విగ్రహాలను ముగ్గళ్లలో, రాజంపేట, మునికూడలి, కాటవరం విగ్రహాలను మునికూడలిలో, బొబ్బిల్లంకలోని విగ్రహాలను ఆ గ్రామ రేవులలో నిమజ్జనం చేస్తున్నారు. ఆయా రేవుల వద్ద వీఆర్వోలు, సచివాయ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడాపోటీలు



నియోజకవర్గ స్థాయికి ఎంపికైన మెల్లూరు క్రీడాకారులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో గురువారం నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంఈవో కె.స్వామినాయక్, కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ క్రీడా పోటీల ద్వారా విద్యార్థుల్లో మానసిక వికాసం, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. కాగా.. పోటీలకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 200 మంది హాజరయ్యారు. వారికి వాలీబాల్, కబడ్డీ, కోకో, చెస్, యోగా, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పీడీలు సింహాద్రిరావు, సుబ్రహ్మణ్యం, వీరబాబు పర్యవేక్షించారు.



సీతానగరంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో స్వామినాయక్

అనపర్తిలో..

పెదపూడి: అనపర్తిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొత్తం ఈ క్రీడా విభాగాల నుంచి సుమారు 160 విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఒక్కో క్రీడా విభాగంలో మండల స్థాయి జట్టును ఎంపిక చేశారు. అలాగే మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ జట్ల ఎంపిక

అనపర్తిలోని ఎస్ఆర్‌జెడ్‌పీపీ పాఠశాల ఆవరణంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఉత్తమ నియోజకవర్గ జట్లు ఎంపిక శుక్రవారం జరుగుతుంది. ఈ విషయాన్ని ఈ ఎంపికల ఆర్గనైజర్లు టీవీవీఎస్ రాఘవరెడ్డి, పడాల శ్రీనివాసారెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభిస్తారన్నారు.

విద్యార్థుల ప్రతిభ

బిక్కవోలు: బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద ఈ నెల 13, 14, 18, 19 తేదీల్లో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గ్రేమ్స్ పోటీలలో మెల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మి తెలిపారు. ఆమె గురువారం మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలోని పీడీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో ఉత్కంఠగా సాగుతున్న కబడ్డీ పోటీలు

ఉపాధ్యాయుల సంక్షేమానికి ఏపీటీఎఫ్ కృషి

కంబాలచెరువు: ఉపాధ్యాయుల సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ప్రధాన ధ్యేయమని జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక నెహ్రూ నగర్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కె.డేవిడ్ లివింగ్ స్టన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఏపీటీఎఫ్ 80 ఏళ్లుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. రాబోయే కాలంలో మరిన్ని విజయాలను సొంతం చేసుకుంటూ శత జయంతి ఉత్సవాలు జరుపుకోవడానికి పరుగులు పెడుతోందన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు వి.అప్పయ్య శాస్త్రి మాట్లాడుతూ జిల్లాలో ఏపీటీఎఫ్ ఒక బలీయమైన సంఘంగా అన్ని సమస్యలపై పోరాటం సాగిస్తున్నట్టు తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, సోము వీర్రాజు

పెదపూడి: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ సీనియర్ నేత సోము వీర్రాజు అన్నారు. అనపర్తి మండలం పాలమూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ, యువమోర్చా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే అనపర్తిలోని రామారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధికారులు, ఎన్డీఏ నాయకులు మానవహారంగా ఏర్పడ్డారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ శివరామకృష్ణంరాజు, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి శివ ప్రసాద్ పాల్గొన్నారు.